www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

గురువారం | 14 | మే | 2026 పేజీలు : 8


## సుజాతనగర్ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

-ఎంఎల్ఎ కూనంనేని



2లో..




## ప్రజల ఆశీర్వాదంతోనే గుర్తింపు

-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

-నిస్వార్థ నాయకుడు తుమ్మల

-ఆత్మీయ సభలో ఎంఎల్ఎ కూనంనేని





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నందమూరి తారక రామారావు పిలుపుతో రాజకీయాల్లోకి వచ్చిన తనకు ప్రజల ఆశీర్వాదంతోనే గుర్తింపు లభించిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శ్రీ సీతారామ చంద్రస్వామి దయతో ప్రజలకు సేవ చేసే భాగ్యం తనకు కలిగిందని, తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సమస్యల పరిష్కారం మిగతా 2లో..

## మోడీ విధానాలు దేశానికి ప్రమాదకరం

-అసంతృప్తిలో రాష్ట్ర రైతాంగం

-వివిజిరాం జీ రద్దు కోరుతూ దశల వారీ పోరాటం

-సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో బాగం

2లో






# ప్రజల ఆశీర్వాదంతోనే గుర్తింపు



**(మొదటిపేజీ తరువాయి)**
కోసమే పని చేసినట్లు తనకు అవకాశం కల్పించిన ఉమ్మడి ఖమ్మంజిల్లా ప్రజలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తొలి సారి మంత్రిగా బాధ్యతలు చేపట్టి 40 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఖమ్మం ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానంలో ఆత్మీయ సభ నిర్వహిం చారు. తొలుత రాపర్తి నగర్ నుంచి ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌టిఆర్ సర్కిల్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ స్వర్గీయ నందమూరి తారక రామారావు పిలుపు మేరకు 1982లో రాజకీయాల్లోకి వచ్చినట్లు తుమ్మల తెలి పారు. 1986 మే 14న మొదటిసారి నందమూరి తారక రామారావు మంత్రి వర్గంలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నలుగురు ముఖ్యమంత్రులు నందమూరి తారక రామారావు, నారా చంద్రబాబు నాయుడు, కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో తాను మంత్రిగా బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. తాను ఏ పార్టీలో ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసమే పని చేసినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ ఏరియాల్లో కూడా అక్కడి ప్రజలకు మెరుగైన మౌళిక వసతుల కల్పనకు కృషి చేసినట్లు తెలిపారు. రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం వంటి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రతి ఊరికి నీటిని అందించినట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు రహదారుల ఏర్పా టుతో పాటు ఖమ్మం చుట్టూ జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు తెలి పారు. భద్రాచలమదాసు ప్రాజెక్టు ద్వారా పాలేరు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసి నట్లు తెలిపారు. నాగార్జున సాగర్ కాలువపై పలు ప్రాంతాల్లో ఎత్తి పోతల పథ కాలను ఏర్పాటు చేసి సాగునీటిని అందించామన్నారు. ఏ పార్టీ అధికా రంలో ఉన్న ప్రజల కోసమే తాను పని చేశానన్నారు. అవినీతి లేని సుపరిపా లన అందించడమే తన లక్ష్యమ న్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాను సస్య శ్యామలం చేయ డమే తన లక్ష్యమని తెలిపారు. 40 ఏళ్ల పాటు తనను ఆదరిస్తూ, అభిమాని స్తున్న జిల్లా ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.



### మచ్చలేని నాయకుడు మంత్రి తుమ్మల : ఎంఎల్ఎ కూనంనేని

తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో మచ్చలేని నాయకునిగా ప్రజలకు సేవలు అందించిన ఘనత మంత్రి తుమ్మల నాగేశ్వరరావుదని కొత్తగూడెం ఎంఎల్ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ప్రజాస్వామ్యంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు సేవకుడిలా పని చేశార న్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉంద న్నారు. తాను మండల పరిషత్ అధ్యక్షునిగా ఉన్నప్పుడు తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా ఉన్నారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మచ్చ లేని నాయకునిగా నిలిచారన్నారు. ప్రజలకు అవ సరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేశారు. ప్రస్తుత రాజకీయాల్లో సేవ చేసే వారు కాకుండా వ్యాపారులు వస్తున్నారని ఇటువంటి తరుణంలో కూడా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిస్వార్థంగా సేవలు అందిస్తున్నారన్నారు. 40 ఏళ్ల రాజ కీయ జీవితంలో 20 ఏళ్లు మంత్రిగా పనిచేసిన ఘనత తుమ్మల నాగేశ్వరరావుద న్నారు. కమ్యూనిస్టులతో టిడిపి పొత్తు ఉన్న సమయంలో కూడా కమ్యూనిస్టు నాయకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగి ఎటువంటి అరమరి కలు లేకుండా పాలన సాగించారన్నారు. ముక్కుసూటి తత్వం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నైజం అన్నారు. ఏ అంశంపై న అయినా సుదీర్ఘంగా అసెంబ్లీలో మాట్లాడగలిగే వ్యక్తి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో మాజీ ఎంఎల్ఎ గుమ్మడి నర్సయ్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, టిడిపి నాయకులు వాసిరెడ్డి రామనాథం, మాజీ జెడ్పి ఛైర్మన్ గడిపల్లి కవిత, టిజివో రాష్ట్ర కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వర రావు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మిత్రులు కందిమళ్ల కృష్ణారావు తదిత రులు ప్రసంగించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వివిధ పార్టీల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదిత రులు పాల్గొన్నారు.

# సుజాతనగర్ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ ప్రాంతంలో గల మారు మూల రోడ్లను సైతం అభివృద్ధి చేస్తామని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. బుధవారం సర్వారం గ్రామంలో గల ఆర్ అండ్ బి రోడ్డు కంకర మిల్లు నుండి గోపా తండా వరకు కోటి రూపాయలతో నిర్మిస్తున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కూనం నేని మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం వలన చుట్టుపక్కల గ్రామాలకు రాకపోకలకు దూరం తగ్గుతుందని తెలియజేశారు. ఆలియా తండా నుండి సర్వారం వరకు నిధులు మంజూరయ్యాయని మూడు కోట్ల రూపాయలు నిధులతో లింక్ రోడ్ లోని పూర్తి చేసి ప్రజలకు రోడ్ల సమస్య లేకుండా పూర్తి చేస్తా మని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే నర్సింగ్ సాగర్, స్టేషన్ బేతంపూడి, సర్వారం గ్రామాలలో రోడ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. సర్వారం గ్రామ ప్రజలతో మంచి అనుబంధం ఉందని త్వరలో అనుసెట్టిపల్లి నుండి సర్వారం రుద్రంపూర్ నుండి పాల్వంచ వరకు రూ. 600 కోట్ల రూపాయలతో రింగ్ రోడ్డు నిర్మాణం జరగబో తుందని, ఈ ప్రాంతం నగరంగా రూపుదిద్దుకుంటుందని చెప్పారు. రోడ్ల నిర్మాణం నాణ్యతగా జరగాలని ఎల్లప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, మేయర్ మూడు గణేష్, గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, సర్పంచ్ సునీత, ఆర్ అండ్ బి డిఇ నాగేశ్వరరావు, తహశీల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో భారతి, ఎలక్ట్రికల్ ఏఈ కిషన్ , సిపిఐ నాయకులు కుమారి హనుమంతరావు, వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, జక్కుల రాములు, లావుడియా గోపి, సర్పంచ్ రామనాథం, భూక్యా శ్రీను, కోమరి కృష్ణ, మండే నాగేశ్వరరావు, దండు సురేష్, భూక్యా కృష్ణ, అధికారులు, ప్రజా ప్రతినిధులు, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# చలో కొత్త గూడ బహిరంగ సభను విజయవంతం చేయండి

**- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డా.మైపతి అరుణ్ కుమార్**



**ప్రజాపక్షం/కరకగూడెం:** జూన్ 03వ తేదీన జరిగే చలో కొత్త గూడ తుడుందెబ్బ బహిరంగ సభ ను విజయ వంతం చేయాలని భద్రాద్రి జిల్లా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా.మైపతి అరుణ్ కుమార్ పిలుపు నిచ్చారు. బుధవారం కరకగూడెం మండల కేంద్రంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలెబోయిన వెంకటనారాయణ, తుడుందెబ్బ భద్రాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కలం వేణుగోపాల్ అధ్యక్షతన అత్య వసర సమావేశం జరిగింది. ఈ సమావేశం కి తుడుందెబ్బ రాష్ట్ర అధ్య క్షులు డా. మైపతి అరుణ్ కుమార్ హాజరై మాట్లాడుతూ జూన్ 03వ తేదీన మహబూబాబాద్ జిల్లా పాకాల కొత్తగూడ మండల కేంద్రం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యం లో లంబా డీలు ఎస్టీ లు కాదు అని భారీ బహిరంగ సభ నిర్వహణ చేయనున్నట్లు తెలిపారు. 1976 నుండి 2026 వరకు 50 సంవత్సరాలు ఆదివాసీల రిజర్వేషన్లను అక్రమంగా దోచుకు తింటున్న లంబాడీలు అక్రమంగా ఎస్టీ జాబితా చేరి ఆదివాసీల అన్యాయం చేస్తున్నారు అని ఉవ్వెత్తున ఉద్యమాలు లేచిన కాని నేడు ప్రభుత్వం గాని వివిధ రాజకీయ పార్టీ లు కానీ లంబాడా సమస్య పై మాట్లాడే పరిస్థితి లేదు అన్నారు. ఏజెన్సీ సర్టి ఫికేట్ లు లేక ఏజెన్సీ ఉద్యోగాలు రాక ఏజెన్సీ డి ఎస్సీ లు లేక ఆదివాసీ నిరుద్యోగ యువత రోజు రోజు కు పెరిగి పోతుంది అన్నారు. ఐటిడిఏ ల ద్వారా జరగాల్సిన ఉద్యోగ ప్రక్రియ జీవో 317 పేరిట నూతన జోనల్ విధానం తో నేడు టిఎస్‌పిఎస్‌సి లాంటి సంస్థలు ఏజెన్సీ జీవో లను 5వ షెడ్యూల్ ను బొంద పెట్టి జెనరల్ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమ లు చేయటం తో ఉద్యోగాలు రాని పరిస్థితి, పోడు భూములకు పట్టాలు లేవు ఉన్న భూములకు దిక్కు లేదు అందుకో బోర్లు వేస్తే అటవి శాఖ గోస పెడుతుంది అందుకే ఆదివాసీ అస్తిత్వం లో ఆదివాసీ పోరుకేక బహిరంగ సభ జరుపుతున్న క్రమం లో ఆదివాసీ లు వేలాదిగా తరలి వచ్చి ప్రభుత్వం కి మన సత్తా ఏమిటో చూపేలా సభ నడపాలని పిలు పునిచ్చారు. ఆదివాసీ ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు ఈ సభ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలెబోయినా వెంకటనారాయణ, భద్రా ద్రి తుడుం దెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, కలం వేణు గోపాల్, ప్రచార కార్యదర్శి, సుతారి నాగేశ్వరరావు, సంక్షేమ పరిషత్, మండల అధ్య క్షులు చందా, రామకృష్ణ, తుడుం దెబ్బ మాజీ అధ్యక్షులు, ఊకే గణేష్, కలం సాంబ మూర్తి, మండల తుడుం దెబ్బ ప్రధాన కార్యదర్శి కలం సంపత్,పోలేబోయినా రాజు, వెంకటనరసయ్య, ఎఎస్‌యు భద్రాద్రి జిల్లా ఉపాధ్యక్షులు ఇర్ప నాగకృష్ణ , ఎఎస్‌యు భద్రాద్రి జిల్లా అధి కార ప్రతినిధి కోశాధికారి పోలెబోయిన స్వామిప్రసాద్, పోలెబోయిన వెంకటేష్, ఉదయ్, సతీష్, ప్రవీణ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

# మోడీ విధానాలు దేశానికి ప్రమాదకరం




**ప్రజాపక్షం/ ఖమ్మం :** మోడీ విధానాలు దేశానికి ప్రమాదకరమని మోడీ పాలనకు రాష్ట్రాల ఎన్నికల గెలుపుతో మోడీ పాలనకు సానుకూలతగా భావించలేమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. బిజెపి గెలుపు వెనక అనేక పార్శ్వాలు దాగి ఉన్నా యని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు ఖమ్మం జిల్లా సమితి సమావేశం బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. పోటులూరి మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బాగం హేమంతరావు మాట్లాడుతూ ఓట్ల తొలగింపు, ఎన్నికల కమిషన్ విధానం, ప్రలోభాలు తదితర అంశాలు బిజెపి గెలుపు వెనక దాగి ఉన్నాయన్నారు. దేశంలో ధరలు పెరిగిపోతున్నా యని ప్రతి సమస్యకు పరిష్కారం కర్మ ఫలమేనన్న వాదాన్ని బిజెపి తీసుకు వస్తుందని ఆయన తెలిపారు. సమస్యలను పరిష్కరించకుండా హిందుత్వ నినాదంతో ప్రజల మధ్య విభజన రేఖ తీసుకు రావడం ద్వారా లబ్ది పొందుతుందన్నారు. లేబర్ కోడ్స్, విబిజిరాం జీ పథకాలు ప్రజా వ్యతిరేక నిర్ణయాలని హేమంతరావు తెలిపారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఇప్పటికే యావత్ దేశ కార్మికులు పోరాటాలు సాగిస్తున్నారని రాజధాని ఢిల్లీ పరిసరాల్లోనే కార్మికులు నిరంతర పోరాటాలకు సిద్ధమయ్యారని హేమంతరావు తెలిపారు. విబిజిరాం జీ పథకాన్ని కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని దీనిని రద్దు చేసి యధావిధిగా మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని, వివిధ దశల్లో ఆందోళన చేపడుతున్నామని హేమంతరావు తెలిపారు. ఈ నెల 15న మొదలై పథకం రద్దు చేసేంత వరకు ఆందోళన కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఒక పక్క రైతు భరోసా పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడం, మరో పక్క ధాన్యం, మొక్కజొన్నల కొనుగోళ్లలో విఫలం కావడమే ఈ పరిస్థితికి కారణమని హేమంతరావు తెలిపారు. మొక్కజొన్నలు కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరగడంతో రైతులపై అదనపు భారం పడుతుందని ఆయన తెలిపారు. రెండు నెలలు దాటిన ఇంత వరకు మొక్కజొన్న రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమ కాలేదని ఆయన తెలిపారు. ధాన్యం రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. క్వింటాకు 10 కేజీల వరకు కోత విధించడంతో పా టు రోజుల తరబడి దిగుమతులు జరగడం లేదని ఎగుమతి ఖర్చు కూడా రైతులకు పెనుభారం గా మారిందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన తెలిపారు. ఇప్పటికైనా రైతుల్లో ఉన్న అసంతృప్తిని తొలగిం చేందుకు విస్తృత స్థాయిలో కొనుగోళ్లు ప్రారంభించాలని రైతుల ఇబ్బందులను తొలగించాలని ఆయ న డిమాండ్ చేశారు. సంస్థాగత నిర్మాణంపై దృష్టిసారించాలని ఆయన సూచించారు. పార్టీ ప్రజా సంఘాల బలోపేతమే లక్ష్యంగా పని చేయాలని హేమంతరావు కోరారు. జిల్లా కార్య దర్శి దండి సురేష్ కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టగా ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్‌మౌలానా, జిల్లాసహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# అధిక సామర్థ్యం గల గోదాములను సిద్ధం చేయండి



**-తగిన హమాలీలను ఏర్పాటు చేయాలి**
**-వ్యవసాయ మార్కెట్‌లో**
**మొక్కజొన్న నిల్వల ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన మొక్కజొన్న నిల్వ కోసం ప్రస్తుతం అందుబాటులో ఉన్న గోదాములకు అదనంగా సామర్థ్యం గల గోదాములను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టర్ దివాకర టిఎస్ ఖమ్మం త్రీటౌన్‌లోని వ్యవసాయ మార్కెట్ నందు మొక్కజొన్నల నిల్వల ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న గోదాములకు తరలింపు రవాణాను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. మిర్చి, పత్తి మార్కెట్లలో మొక్కజొన్న నిల్వ సామర్థ్యం, అందుబాటులో ఉన్న సదుపాయాలకు సంబంధించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నుంచి గోదాంకు ముమ్మరంగా తరలింపు చేపట్టాలన్నారు. నిల్వ ప్రక్రియలో ఎలాంటి అంతరాలు కలుగకుండా తగినంత హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మొక్కజొన్న కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. గోదాముల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించి నిల్వ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. హమాలీల సంఖ్యను పెంచి లారీల అన్‌లోడింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. లారీలు వచ్చిన వెంటనే మొక్కజొన్న దించుకునేలా చూడాలన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు స్టోరేజీ గోదాములను గుర్తించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. నిల్వ సామర్థ్యాన్ని పెంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టాలని మొక్కజొన్న నిల్వ, రవాణా ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ ఛైర్మన్ తల్లాడ రమేష్, జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, సంబంధిత శాఖల అధికారులు, మార్కెటింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేపు జాబ్‌మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేటు రంగం పోర్ట హోమ్ హెల్త్ కేర్‌లో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం ఇల్లందు క్రాస్ రోడ్డులోని టిటిడిసి భవన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. కేర్‌టేకర్ (మేల్, ఫిమేల్) 50 ఉద్యోగాలకు ఎనిమిదవ తరగతి నుంచి ఇంటర్ వరకు అర్హత గల 20 నుండి 35 సంవత్సరాల లోపు వయస్సు గల వారు అర్హులని ఎంపికైన వారికి వేతనం రూ. 16,500, రూ.22వేల వరకు ఉంటుందని తెలిపారు. మొత్తం 50 ఉద్యోగాల ఖాళీల భర్తీకి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి ఉద్యోగ ఖాళీలు హైదరాబాద్‌లో ఉన్నాయని ఆసక్తి, అర్హత గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్, ఆధార్, పాన్‌కార్డు, బ్యాంక్ పాసుపుస్తకం జిరాక్స్ కాపీలు, మూడు ఫోటోలతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెం.9494730461, 7995553684 నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిణి సూచించారు.

## పైలాన్ నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రాజకీయ ప్రస్థానానికి చిహ్నంగా నిర్మించే పైలాన్ పనులకు శంకుస్థాపన చేశారు. బుధవారం లకారం ట్యాంక్ బండ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 40 ఏళ్ల రాజకీయ విజయ ప్రస్థానానికి చిహ్నంగా ఏర్పాటు చేయనున్న పైలాన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు తుమ్మల యుగంధర్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం కార్పోరేషన్ డిసిసి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 60వ డివిజన్ రామన్నపేటలో శ్రీ పెద్దమ్మ తల్లి పోతురాజు సింహ వాహన, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. బుధవారం భక్తజన సందోహం మధ్య వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పెద్దమ్మతల్లి, పోతురాజు సింహ వాహన ధ్వజస్తంభ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి రూ.50వేల విరాళాన్ని అందజేశారు. పెద్దమ్మతల్లి విగ్రహంతో పాటు పంచముఖి, నాగేంద్రుడు, జంట నాగుల ప్రతిష్ఠాపన చేశారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రామన్నపేటలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంట బంధువుల రాకతో సందడిగా మారింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# కాంగ్రెస్ పాలనలో విద్యారంగానికి పెద్దపీట

**వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ**





**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా శాఖ వారోత్సవాల్లో భాగంగా బుధవారం వైరా మండల విద్యా శాఖ, మండల విద్యాధికారి కొత్తపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు వైరాలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద విద్యపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో వైరా మున్సిపాలిటీ ఛైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ విద్యారంగానికి పెద్ద పీట వేస్తుంది ప్రభుత్వం అని అన్నారు. ప్రతి సర్పంచ్ తల్లిదండ్రులతో సత్సంబంధాలను కలిగి విద్యార్థుల యొక్క విద్యాభివృద్ధికి తోడ్పడాలని అలా అని ప్రభుత్వం నూతనంగాప్రవేశపెట్టేటువంటి యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్, తెలంగాణ పబ్లిక్ స్కూల్ వంటి పాఠశాలతో పాటు ఈ విద్యా సంవత్సరం ఉదయం ఒకటి నుండి ఇంటర్మీడియట్ వరకు అల్పాహార కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని, అలాగని మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వారికి కూడా అందజేస్తున్నారని, అలాగే 22 వస్తువులతో కూడిన ఎడ్యుకేషన్ కిట్‌ని కూడా త్వరలో విద్యార్థులకు అందజేయనుందని, గ్రామ ప్రథమ పౌరులుగా గ్రామంలో ఉన్న విద్యార్థులందరికి నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైనటువంటి ఆహారం, క్రమశిక్షణ ఉన్నత విదాయ ప్రమాణాలు కలిగి ఉపాధ్యాయులతో కూడిన బోధనను కలిగి ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రతి ఒక్కరికి నమ్మకం కలిగించి ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రతిఒక్కరికి నమ్మకం కలిగించి విద్యార్థులు నమోదును పెంచుటకు కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి సక్రియ, ఎంపిఓ రాజేశ్వరి, ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు దొంతబోయిన సత్యనారాయణ, జి.మాధవరావు, ఏపిపిసి చైర్మన్‌లు పాల్గొన్నారు.

# జోరుగా ఇసుక అక్రమ దందా..!

**ఓ ప్రజాప్రతినిధి పేరుతో ఇసుక రవాణా**
**వైరా, కొణిజర్ల మండలంలో ఇసుక మాఫియా**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో అక్రమ ఇసుక రవాణా దందా జోరుగా కొనసాగుతూ ఉంది. రాత్రి పగలు ట్రాక్టర్లతో ఇసుక మాఫియాను కొనసాగిస్తున్నారు. అభివృద్ధి పనుల పేరుతో అక్రమ వ్యాపారం జోరుగా కొనసాగుతుంది. ప్రభుత్వం అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని పదేపదే హెచ్చరిస్తున్న వైరా, కొణిజర్ల మండలంలో ఇసుక రవాణా జోరుగా కొనసాగుతుంది. ఓ ప్రజాప్రతినిధి పేరుతో కొందరు ఇసుక మాఫియాకు తెరలేపారు. ఆ ప్రజాప్రతినిధికి తెలియజేయకపోయినా ఆయన పేరును జోరుగా వాడుతున్నట్లు సమాచారం. ఎందుకు అంటే ఇసుక ట్రాక్టర్లను ఎవరు ఆపకుండా ఎవరైనా ఆపితే మా వెనుక ప్రజాప్రతినిధి ఉన్నాడు. మేము చెప్పింది అన్నకు వేదం అనే సరికొత్త మాటలు వినిపిస్తున్నారు. రెవెన్యూ పోలీస్ మైనింగ్ అధికారులు ఎవరూ మా వైపు చూడటానికి వీల్లేదు. మా అన్న మా వెనక ఉన్నాడు, మేము ఏది చేసినా అన్న ఒప్పుకుంటాడు అంటూ ఇసుక రవాణా అక్రమ వ్యాపారం జోరుగా కొనసాగుతుంది. అసలు ప్రభుత్వం అనుమతులు లేకుండా ఇసుక రవాణా కొనసాగుతుంటే అడ్డుకట్ట చేయాల్సిన బాధ్యత ఎవరిది, ఎందుకు అధికారులు మౌనంగా ఉంటున్నారు. అధికారులకు తెలిసిన ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయడం లేదా, నిజంగానే ఓ ప్రజాప్రతినిధి అక్రమ ఇసుక రవాణా గురించి అధికారులను మౌనంగా ఉండమన్నారా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక దొరకక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ ఉంటే అక్రమ ఇసుక వ్యాపారం మాత్రం జోరుగా కొనసాగుతున్నారు. ఇదే అనువుగా చూసి అధిక ధరకు ప్రజల అవసరాలను బట్టి ఇసుక అమ్మకాలు జరుగుతూ ఉన్నాయి. అక్రమ ఇసుక వ్యాపారులు ప్రజాప్రతినిధి పేరుని ఎందుకు వాడుతున్నారు, నిజంగానే ఆయన చెప్పారా, వైరా నది నుండి ఈ ఇసుక రవాణా కొణిజర్ల వరకు జోరుగా కొనసాగుతుంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని వైరా, కొణిజర్ల మండలాల్లో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణా వ్యాపారానికి అడ్డుకట్ట వేస్తారా ప్రజాప్రతినిధి పేరు ఎందుకు వాడుతున్నారనే దానిపై విచారణ చేపడతారా, ఎక్కడెక్కడ ఇసుక రవాణా జరుగుతుంది. ఆ ఇసుక రవాణా చేసేవారు ఎవరెవరు ప్రజాప్రతినిధి పేరు వాడుతున్నారు అనే దానిపై విచారణ చేస్తారా అనేది కూడా చర్చనీయాంశంగా మారింది. మండలంలో ప్రతి రోజు వందలాది ట్రాక్టరల అక్రమ రవాణా వైరా మండలంతో పాటు కొణిజర్ల మండలానికి జరుగుతూ ఉంది. ఇప్పటికైనా అధికారులు అక్రమ ఇసుక రవాణాదారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఇందిరమ్మ కాలనీ వద్ద రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు




**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు మధిర రోడ్డు ఇందిరమ్మ కాలనీ వద్ద టిజి ఆర్‌టిసి రిక్వెస్ట్ బస్టాప్‌ను ఏర్పాటు చేశారు. వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి వైరాలో ఇందిరమ్మ కాలనీ నందు దాదాపు 250 కుటుంబాలు నివసిస్తాయని ఇక్కడ నుండి ప్రజలు పనుల కోసం ఉదయం ఖమ్మంతో పాటు ఇతర ప్రాంతాలకు వెళతారని రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఆర్‌టిసి ఆర్‌ఎం డిఎం దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఆర్‌టిసి అధికారులు రిక్వెస్ట్ స్టాప్ బోర్డ్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. అన్ని బస్సులను ఇక్కడ ఆపేందుకు అనుమతిని ఇచ్చారు.

**కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు...**

రిక్వెస్ట్ బస్టాప్ ఏర్పాటు చేయడం పట్ల ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మునిసిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్‌కు ఇందిరమ్మ కాలనీ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో సంవత్సరాల నుండి ప్రజల పడుతున్న ఇబ్బదులను దృష్టిలో పెట్టుకొని కష్టాలు తీర్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీవాసులు దారగాని చంద్రం, గుర్రం పూర్ణ, బొజ్జగాని రామకృష్ణ, పందిళ్ళ శ్రీను, తీకారం అరుణ, నోసిన లలిత, దారకాని సాయి, గుర్రం కుమారి, పద్మ, భ్రమరాంబ, మాదం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లు రామకృష్ణ, ముదిగొండ మహేష్, ఆర్‌టిసి అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహ ప్రవేశం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల కేంద్రం లోని ఎస్సీబీసీ కాలనీలో జరిగిన ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. మండల కేంద్రంలో కాలనీ కి చెందిన అందిమళ్ల నాగరాణి లబ్ధిదారురాలు బుధవారం ఇందిరమ్మ గృహ ప్రవేశంకు ఆహ్వానించారు. ఈమేరకు ప్రవేశంను ప్రారంభించారు. లబ్దిదారులకు నూతన వస్త్రాలు అందించారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరిందని, మీకు జీవితాంతం రుణపడి ఉంటామని లబ్దిదారురాలు మంత్రి వద్ద సంతోషం ను వ్యక్తం చేశారు. ఆచార్లగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ను మంత్రి ప్రారంభించారు. పలు కుటుంబాలను సందర్శించారు. నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొడాలి గోవిందరావు, ఆచార్లగూడెం సర్పంచ్ కొలికపొంగు ఉప్పలమ్మ, బచ్చలకూరి నాగరాజు, పుసుపులేటి శ్రీలత, మామిడి వెంకన్న, మట్టా దుర్గారెడ్డి, జెర్రిపోతుల సత్యనారాయణ, రేగూరి హనుమంతరావు, వంగవీటి పవన్, కొడిరెక్క వినోద్, రాయపూడి రోహిత్, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీక్‌పై ప్రశ్నిస్తే లాఠీచార్జ్‌లా..?



**ప్రజాపక్షం/కారేపల్లి:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గవర్నర్ భవన్ ఎదుట శాంతి యుతంగా ధర్నా నిర్వహిస్తున్న బిఆర్ఎస్వి నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి అక్రమ అరెస్టులు చేయడం దారుణమని బిఆర్ఎస్వి విద్యార్థి విభాగం నియోజకవర్గ నాయకులు జూపల్లి రాము తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు బలవంతంగా అణచివేయటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. నీట్ పేపర్ లీక్ ఘటనతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తున్న బిఆర్ఎస్వి నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం ద్వారా ఉద్యమాలను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు బిఆర్ఎస్వి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. శాంతి యువతంగా నిరసన తెలిపిన బిఆర్ఎస్వి నాయకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి విడుదల చేయాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం




**ప్రజాపక్షం/కూసుమంచి:** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల షెడ్యూల్‌లో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో మూడో రోజు బుధవారం కూసుమంచి మండల స్థాయి సర్పంచుల అవగాహన సదస్సు నిర్వహించారు. కూసుమంచి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈకార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి రాయల వీరస్వామి అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన ఎంపీడీవో జస్వంత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంఈఓ రాయల వీరస్వామి మాట్లాడుతూ గత విద్యా సంవత్సరంలో మండలంలోని 11 పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగిందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా విద్యార్థుల నమోదును మరింత పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థుల నమోదు పెంపు వంటి అంశాలపై సర్పంచులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో కూసుమంచి సర్పంచ్ కొండా కృష్ణవేణి, వివిధ గ్రామాల సర్పంచులు, మల్లేపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు భూలక్ష్మి, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**-రైతుల సమస్యలు తెలుసుకుని అధికారులకు కీలక సూచనలు**



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలం పాలేరు వద్ద ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు కల్పించిన సౌకర్యాలు, ధాన్యం నిల్వలు, కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం అమ్మకానికి వచ్చిన రైతులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి ధాన్యం సేకరణను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులకు పారదర్శకంగా వేగంగా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.

# ఎక్సైజ్ అధికారుల ద్వంద ప్రమాణాలు..!

**-కాపుసారంపై దృష్టి...బెల్ట్ షాపులపై అలక్ష్యం**
**-బెల్ట్ షాపులో నిర్వహణకే ఓ వైన్ షాప్ కేటాయింపు**
**-ఓ వ్యక్తి భరోసా పైనే అక్రమ వ్యాపారం**



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలో అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ శాఖ వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాపుసార(ఇలీగల్ లిక్కర్)నిర్మూలనపై మాత్రమే దృష్టి పెట్టి, బెల్డ్ షాపులపై పూర్తిగా అలక్ష్యం చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూసుమంచి మండల పరిధిలోని సుమారు 41 గ్రామ పంచాయితీలలో 500కు పైగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రతి బెల్డ్ షాప్‌కు ఒక వైన్స్ పాప్ అనుబంధంగా ఉండి, అక్కడి నుంచి సరఫరా జరుగుతోందని ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా కూసుమంచి మండల కేంద్రంలో ప్రత్యేకంగా బెల్ట్ షాపులకే మద్యం సరఫరా చేయడానికి ఓ వైన్ షాపుని కేటాయించుకొని నిర్వహించడం ఈ షాపుల్లో మద్యం ఎంఆర్పీ కంటే రూ 20 వరకు అధిక ధరలకు విక్రయించడం సాధారణంగా మారిందని వినియోగదారులు వాపోతున్నారు. చివరికి వినియోగదారునికి చేతికి అందే సరికి అది 20 రూపాయలుగా అదనపు భారంగా పడుతుందని తెలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో టీ స్టాళ్లు, కిరణా దుకాణాల వెనుక భాగాల్లో రహస్యంగా నడుస్తున్న ఈ బెల్ట్ షాపులు స్థానిక యువతను ఆకర్షిస్తున్నాయని, సామాజిక సమస్యలకు దారి తీస్తున్నాయని పెద్దలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, నేలకొండపల్లి పరిధిలోని ఎక్సైజ్ అధికారులు ఈ అంశంపై తిరిగి చూడటం లేదని విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ లోపం వల్లే అక్రమ వ్యాపారం విస్తరిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. నిబంధనల ప్రకారం లైసెన్స్ ఉన్న వైన్స్ షాపుల్లోనే మద్యం విక్రయం జరగాలి, అయితే బెల్డ్ షాపుల రూపంలో జరుగుతున్న అక్రమ విక్రయాలు బహిరంగ రహస్యంగా మారినా, సంబంధిత శాఖ నుంచి చర్యలు కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ఓ వ్యక్తి భరోసాపై అక్రమ వ్యాపారం....**

కూసుమంచి మండల కేంద్రంలో వైన్ షాపులకు ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కొన్ని సంవత్సరాలుగా అందర్నీ కలుపుకొని వివిధ రాజకీయ పార్టీ నాయకులను మేనేజ్ చేస్తూ నడుస్తున్న క్రమంలో ఈ సంవత్సరం మరింత బరితెగించి ఎవరు రాతలు పూతలు, శాఖలు చేసిన నేనున్నాను అందరికీ సరి చెప్తానంటూ భరోసా ఇస్తూ తప్పుడు పద్ధతులకు అండదండలుగా ఉంటూ నాకు అందరు తెలుసు, మాజీలు, తాజాలు అందరితో నేను మాట్లాడతా బెల్ట్ షాపులు నిర్వహించుకోండి అంటూ తానే ఒక మధ్యవర్తిగా మద్యం డాన్‌గా వ్యవహరిస్తున్నాడని విమర్శలు వినినిస్తున్నాయి.

**ప్రజల డిమాండ్...**

బెల్డ్ షాపులపై తక్షణమే ప్రత్యేక దాడులు చేపట్టి, అక్రమ విక్రయాలను అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కూసుమంచి మండలంలో కాపుసారాపై మాత్రమే కఠినంగా వ్యవహరిస్తూ, బెల్డ్ షాపులను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఎక్సైజ్ శాఖపై తీవ్రంగా వినిపిస్తున్నాయి.

**ఎక్సైజ్ సీఐ వివరణ....**

కూసుమంచి మండలంలో నిర్వహిస్తున్న అక్రమ బెల్ట్ షాపుల నిర్వహణ అధికారుల దొంగ ప్రమాణాలు అంశంపై నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ సుంకరి రమేష్‌ని వివరణకై 8712658843ను సంప్రదించగా, తను ఎటువంటి స్పందన లేదు.

# మొక్కజొన్న రైతు గోసకు మంత్రులే బాధ్యత వహించాలి

**రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని గొప్పలు చెప్పి శాసనసభ్యులు, మంత్రులు కొనుగోలు కేంద్రాలు ప్రారంబించారు. కాని కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు గోసపడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మొక్కజొన్న కొనుగోలు ఇతర సమస్యలకు కలెక్టర్లు బాద్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. కాని ఖమ్మం జిల్లాలో మాత్రం ముగ్గురు మంత్రులు ఉండి కూడా మొక్కజొన్న కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతుందని దీనికి బాద్యత శాసన సభ్యులు, ముగ్గురు మంత్రులు బాద్యత వహించాల్సి ఉంటుందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. మండల పరిదిలోని లాలాపురంలో కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు ముగ్గురు మంత్రులు ప్రాతిదినధ్యం వహిస్తున్న జిల్లాలోనే రైతులు అరిగోస పడుతుంటే రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. రైస్ మిల్లుల వద్ద క్వింటాకు పదికిలోల తరుగు కటింగ్‌కు అంగీకారం తెలిపిన రైతుల ధాన్యాన్ని మాత్రమే మిల్లర్లు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. రైతులు పండించిన పంట మిల్లర్లు, లారీ యజమానులపై ఆధారపడి ప్రభుత్వ సంస్థలకు అమ్ముకునే స్థాయికి దిగజారిందని పేర్కొన్నారు. వందక్వింటాళ్ల ధాన్యం పండించిన రైతు పది క్వింటాళ్ల కటింగ్‌కింద మిల్లర్లుకు ఇస్తే రూ 23,690 లు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. లారీలకు బస్తాకు అదనపు చార్జీలు వెయిటింగ్ చార్జీలు చెల్లించాల్సి వస్తుందని మొక్కజొన్నలకు అదనపు చార్జీలు లేకుండా ధాన్యం కొనుగోలుకు తరుగులేకుండా లారీలు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన సమాచారం తెలుసుకున్న కొణిజర్ల తహశీల్దార్ అరుణ, వ్యవసాయ అదికారి కొనుగోలు కేంద్రానికి చేరుకొని గురువారం నుంచి కాంటాలు వేసిన బస్తాలు రైస్ మిల్లులకు తరలించేందుకు ఏర్పాటుచేస్తామని హామినిచ్చారని తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌లో ప్రతీ దరఖాస్తును పరిష్కరిస్తాం

**-శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం**
**-ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి ప్రజా దర్బార్ లో వచ్చిన దరఖాస్తు ను పరిష్కరిస్తామని ఖమ్మం ఆర్డీవో ఎన్.శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ పాలన అధికారులతో బుధవారం ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ప్రజాదర్బార్ లో వచ్చిన దరఖాస్తుల ను పరిశీలించారు. ఏ దరఖాస్తు ఏ దశలో ఉంది. వాటి ప్రగతి తదితర విషయాల పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలేరు నియోజకవర్గంలో ప్రజాదర్బార్ లో రైతులు అందించిన దరఖాస్తు లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. వాటిని సమగ్రంగా పరిశీలించి కనీసం వారం లేదా నెల రోజులు లేదా మూడు నెలలో సమస్య ను బట్టి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దరఖాస్తుల ను సమగ్ర వివరాలతో పరిష్కారం చూపే విధంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మండలం లోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో కాంటాలు వేసిన బస్తాలను నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్ గోడౌన్లలో దిగుమతి చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు ఆర్డీఓ ను కోరారు. రైతులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ధిగుమతులకు అనుమతి ఇచ్చే విధంగా చూడాలని కోరారు. సర్వే నెంబర్ లు తప్పులు ఉండటం వలన తాను ఇబ్బంది పడుతున్నానని కట్టుకాచారం సర్పంచ్ ధనవాత్ సైదులు ఆర్డీవో కు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి డిప్యూటీ తహశీల్దార్ కనకం నరసింహారావు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ లు ఆలస్యం మధుసూధన్ రావు, అల్లం రవికుమార్, జీపీవోలు పాల్గొన్నారు.

# తరుగు తీయడం రైతులను నిలువుదోపిడీ చేయడమే..

**- కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి**
**- ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం**



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** ధాన్యం క్వింటాకు ఐదు కిలోల తరుగు తీయడం రైతులను నిలువు దోపిడీ చేయడమేనని, దీనిని వెంటనే నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని పెనగడప గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ప్రతినిధిబృందం సందర్శించి, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను అమ్ముకోవడానికి వస్తే, తరుగు పేరుతో అడ్డగోలుగా కోత విధిస్తూ అన్నదాతలను మోసం చేయడం అన్యాయమన్నారు. ఇప్పటివరకు కోత పెట్టిన ధాన్యం విలువను లెక్కకట్టి ఆ సొమ్మును తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలని అధికారులను డిమాండ్ చేశారు. తరుగుపేరుతో రైరులకు జరుగుతున్న అన్యాయంపై జిలాల ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరిపడా టార్పాలిన్లు, గిడ్డంగి సౌకర్యం, తాగునీరు, ఎండ తగలకుండా నీడ వంటి కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఎటువంటి నష్టం కలగకుండా ధాన్యం సేకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రతినిధి బృందంలో సంఘం నాయకులు సలిగంటి శ్రీనివాస్, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నీడలా సుధాకర్, కట్ట నాగయ్య, ఉదయ్, నవీన్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం..!

**- ఆందోళనలో పెనగడప రైతులు**



**ప్రజాపక్షం/చుంచుపల్లి :** చుంచుపల్లి మండలంలోని పెనగడప ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఎఫ్ఏక్యూ (ఫెయిర్ అవరేజ్ క్వాలిటీ) విధానం కారణంగా ధాన్యం కొనుగోళ్లు తీవ్రంగా ఆలస్యమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తేమ శాతం 17 వరకు ఉంటే ధాన్యాన్ని కొనుగోలు చేసేవారని, ప్రస్తుతం మాత్రం ఎఫ్ఏక్యూ ప్రమాణాలు పూర్తిగా పాటించిన ధాన్యాన్నే కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ అధికారులు ధాన్యంలో తేమ శాతం, తాలు గింజలు, రంగు మారిన గింజలు, నాణ్యమైన గింజల శాతం తదితర అంశాలను పరీక్షించి ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉంటేనే కొనుగోలు చేపట్టాలని ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. దీంతో ధాన్యం పరిశీలన ప్రక్రియ ఎక్కువ సమయం తీసుకుంటోందని రైతులు వాపోతున్నారు. రోజుకు కేవలం నలుగురు రైతుల ధాన్యాన్నే పరిశీలించి కొనుగోలు చేస్తున్న పరిస్థితి నెలకొనడంతో మిగతా రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. కొనుగోలు ఆలస్యం కావడంతో ధాన్యం తడిసిపోవడం, నాణ్యత తగ్గిపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలు సరిగా లేక ధాన్యం తిరస్కరణకు గురవుతుండడంతో రైతులు తీవ్ర నిరుత్సాహానికి లోనవుతున్నారు. వెంటనే ఎఫ్ఏక్యూ విధానాన్ని రద్దు చేయాలని లేదా నిబంధనలు సడలించి పాత విధానంలోనే ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# మన బడి-మన బాధ్యతతో విద్యా వారోత్సవాల సదస్సు

**-ప్రభుత్వ బడుల బలోపేతానికి సర్పంచ్‌లు, కౌన్సిలర్ల భాగస్వామ్యం**
**-ఎఫ్ఎల్ఎన్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్**
**-ఎంఈఓ రాజేశ్వరరావు**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో 'విద్యా వారోత్సవాలు' సందర్భంగా సర్పంచ్‌లు, మున్సిపల్ కౌన్సిలర్ల అవగాహన సదస్సు బుధవారం ఘనంగా జరిగింది. 'మన బడి మన బాధ్యత' నినాదంతో జరిగిన ఈ సదస్సులో ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య, డిజిటల్ విద్యా విధానాల అమలుపై విస్తృతంగా చర్చించారు. ఏఎక్స్ఎల్ ల్యాబ్స్, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం, ఎల్ఈపీ, డిజిటల్ క్లాస్‌రూమ్స్, పీఎం శ్రీ పాఠశాలలు వంటి వినూత్న కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయని ఎంఈఓ ఎన్. రాజేశ్వరరావు తెలిపారు. ముఖ్యంగా ఎఫ్ఎల్ఎన్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. 'ఎవ్రీ చైల్డ్ రీడ్స్' కార్యక్రమం ద్వారా ఆంగ్ల పఠన నైపుణ్యాలు, ఎల్ఈపీ ద్వారా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక బోధన అందిస్తున్నామని వివరించారు. ఎస్ఎస్‌సీ ఫలితాల మెరుగుదలకు నిరంతర కృషి జరుగుతోందన్నారు. ప్రతి పాఠశాలలో ఇంటర్నెట్ సదుపాయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, ఖాన్ అకాడమీ వంటి డిజిటల్ వనరులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం, త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, 21 వస్తువులతో ఎడ్యుకేషనల్ కిట్, ఉచిత యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, షూస్, బెల్టులు అందిస్తున్నామన్నారు. సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ప్రభుత్వ బడుల అభివృద్ధికి సహకరించాలని, విద్యార్థుల నమోదు పెంచేందుకు గ్రామస్థాయిలో చైతన్యం కల్పించాలని కోరారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు, మహిళా సంఘాలు, ఉపాధ్యాయులు కలిసి పనిచేస్తే ప్రభుత్వ బడులు మరింత బలోపేతమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహా, ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎస్ఐ, జేవీఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ గోపి, కాంప్లెక్స్ చైర్మన్ శైలకుమారి, ఎంపీఓ జ్యోత్స్నాదేవి తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల అభినందన సభకు తరలిన అభిమానులు

**-50 కార్లతో భారీ ర్యాలీ**
**-ఖమ్మంలో పండగ వాతావరణం**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఖమ్మంలో జరుగుతున్న అభినందన సభకు సత్తుపల్లి నుంచి ఆయన అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో బయలుదేరారు. కాంగ్రెస్ సీనియర్ నేత చల్లగుళ్ళ నరసింహారావు ఆధ్వర్యంలో సత్తుపల్లి మండలంలోని తుమ్మూరు, సదాశివునిపాలెం, గంగారం, బేతుపల్లి, సిద్ధారం, రాజీవ్ కాలనీ, గౌరిగూడెం, కొత్తూరు, కాకర్లపల్లి, తాళ్ళమడ తదితర గ్రామాల నుంచి తుమ్మల అభిమానులు పెద్దఎత్తున తరలిరావడంతో సత్తుపల్లిలో పండగ వాతావరణం నెలకొంది. సుమారు 50 కార్లతో భారీ ర్యాలీగా అభిమానులు ఖమ్మానికి పయనమయ్యారు. ఖమ్మం వెళ్ళిన వారిలో చలసాని సాంబశివరావు, వినుకొండ కృష్ణ, జోగారావు, పాకలపాటి శ్రీనివాసరావు, విష్ణు,కోలగట్ల చెన్నారావు, కావేటి అప్పారావు, మరికంటి శ్రీను, ద్రోణవల్లి గోపి, షరీఫ్, ఆంగోతు రామారావు, మోరంపూడి జగన్, కొప్పుల నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇన్‌చార్జి ఎంపీడీవోను సత్కరించిన సర్పంచులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మల్లెల రవీంద్ర ప్రసాద్‌కు మండల సర్పంచులు ఘన స్వాగతం పలికారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు సర్పంచులు ఆయనను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ గ్రామ పంచాయితీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలసిన అవసరం ఉందన్నారు. మండలంలోని అన్ని పంచాయితీలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవోను కోరారు. సర్పంచుల అభ్యర్ధనలకు సానుకూలంగా స్పందించిన మల్లెల రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ పంచాయితీ అభివృద్ధికి కట్టుబడి పని చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ఈకార్యక్రమంలో మండలంలోని పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాశాఖ వారోత్సవాల్లో సర్పంచులకు శిక్షణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న విద్యాశాఖ వారోత్సవాల్లో భాగంగా సర్పంచులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి డి జయరాజు ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సర్పంచులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామ స్థాయిలో విద్యార్థుల నమోదు పెంపుతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు రంజిత్ కుమార్, కారేపల్లి సర్పంచ్ మేదరి టోనీ, దిశా కమిటీ సభ్యురాలు హేమలత, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎలియట్ ప్రేమ్ కుమార్, మాస్టర్ ట్రైనర్లు బి శ్యామ్లాల్, ఎల్ లక్ష్మణ్‌తో పాటు, వివిధ గ్రామ పంచాయితీ సర్పంచులు పాల్గొన్నారు.

## క్రీడలతోనే యువతకు మంచి భవిష్యత్



**ప్రజాపక్షం/ములకలపల్లి:** క్రీడలతోనే యువతకు మంచి భవిష్యత్ ఉంటుందని సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మూకమామిడి గ్రామ పంచాయితీ పరిధిలోని మొగరాలగుప్ప గ్రామ యువతకు క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఆమె సొంత నిధులతో మూడు వాలీబాల్ నెట్లు, మూడు వాలీబాల్స్, 36 జెర్సీలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా యువకులు సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి తో పాటు, వార్డు సభ్యులు తనం పాపని, కీసర రాజ్‌కుమార్, కోర్సా శ్రీకృష్ణలను శాలువాలతో సత్కరించారు. అనంతరం సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని కోరారు. గ్రామాన్ని మత్తు పదార్థాల రహిత గ్రామంగా తీర్చిదిద్దడంలో యువత ముందుండాలన్నారు. హెల్మెట్ ధరించి సురక్షితంగా వాహనాలు నడపాలని సూచించారు. యువజన నాయకులు కోర్సా రాంబాబు మాట్లాడుతూ గ్రామంలోని దివంగత యువకుల జ్ఞాపకార్థంగా త్వరలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు, పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## ఏరియా బీసీ, ఓబీసీ లైజనింగ్ అధికారిగా బుడిగం

**శుభాకాంక్షలు తెలియజేసిన ఐఎన్టీయూసీ నేత క్రాంతి కుమార్**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సింగరేణి సత్తుపల్లి ఏరియా కిష్టారం ఓపెన్ కాస్ట్ మేనేజర్ కార్యాలయంలో ప్రాజెక్ట్ మేనేజర్ బుడిగం రామకృష్ణ ను ఏరియా బీసీ ఓబీసీ లైజన్ అధికారిగా నియమింపబడ్డ సందర్భంగా ఫిట్ సెక్రటరీ బాలాజీ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా ఐఎన్టీయూసీ నాయకులు తీగల క్రాంతికుమా మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రాంతి మాట్లాడుతూ సింగరేణి సంస్థలో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నీతి, నిజాయితీ, నిబద్ధత, కార్మికుల పట్ల గౌరవ మర్యాదలు కలిగి క్రమశిక్షణ, పట్టుదల గల అధికారి బుడిగం రామకృష్ణ ను సత్తుపల్లి, కొత్తగూడెం ఏరియా బీసీ లైజనింగ్ అధికారిగా నియమిస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీచేయడం అభినందనీయమని సత్తుపల్లి ఏరియా ఐఎన్టియుసి జాయింట్ జనరల్ సెక్రెటరీ తీగల క్రాంతి కుమార్ తెలిపారు. ఈ నియామకానికి సహకరించిన సింగరేణి బిసి, ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నల్లపూరి రమేష్, ఇతర ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఐఎన్టీయూసీ కాంట్రాక్ట్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ షేక్ బాజీ, నాయకులు దొంతిమళ్ల శ్రీనివాస్, రాజశేఖర్, రాంసింగ్, నజీర్, యాకూబ్, కోటి, బుక్క శ్రీనివాస్, బావ రమేష్, షణ్ముఖ చారి తదితరులు పాల్గొన్నారు.

# పొన్నెకంటిది మంచి మనసు..





**-సొంత డబ్బు ఖర్చు చేసి ఆలయానికి వంతెన నిర్మాణం**
**-వంతెనను ప్రారంభించి,**
**వెంకటేశ్వర్లును అభినందించిన ఎమ్మెల్యే కూనంనేని**



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** సంపాదన ఎంత ఉన్నా సరే తోటి వారిని ఆదుకోవాలంటే చాలా మందికి మనసు రాదు. ఇతరుల కోసం రూపాయి ఖర్చు చేయాలన్నా ప్రాణం పోయినట్లు ఫీలవుతారు. ఎంత సేపు నేను, నా కుటుంబం ఇంతవరకే ఆలోచిస్తారు. అయితే సమాజంలో అందరూ ఇలానే ఉంటే మానవత్వం అన్నది మచ్చుకైనా కానరాకుండా పోయి రాక్షసత్వం, స్వార్థం మరింత పెరిగిపోయేవి. మరి నేటి స్వార్థ పూరిత సమాజంలో కూడా కొందరు మంచి మనసున్న వారు ఉంటారు. తమ గురించి కాకుండా తోటి వారి గురించి ఆలోచిస్తారు. తమకు చేతనైన సాయం చేస్తారు. తాజాగా గుండెపుడి గ్రామ నివాసి పొన్నెకంటి వెంకటేశ్వర్లు వారి తల్లి దండ్రుల జ్ఞాపకార్థం తన సొంత డబ్బుతో ఆలయ రహదారి మధ్య వున్న వాగుపై వంతెన నిర్మించి, గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాడు. అతడిపై మండల వ్యాప్తంగా ప్రశంసలు కురిపిస్తున్నారు. జూలూరుపాడు మండలపరిధిలోని గుండెపుడి గ్రామంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయానికి వేళ్ళు మార్గ మధ్యలో వాగు ఉండటంతో ఆ గ్రామ ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా వాగు సమస్యతో బాధపడుతున్నారు. గుండెపుడి గ్రామస్తులు ఊరి నుండి ఆలయానికి వెళ్లాలన్నా, ఈ వాగును దాటాల్సిందే. వాగుపై వంతెన నిర్మించాల్సిందిగా అధికారులను కోరినా లాభం లేకుండా పోయింది. ఈక్రమంలో గుండెపుడి గ్రామానికి చెందిన పొన్నెకంటి వెంకటేశ్వర్లు ఈ గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్య గుర్తించి ఎలాగైనా ఈ సమస్యను పరిష్కరించాలని భావించాడు. తన సోదరుల సహాయ సహకారాలతో తండ్రి మల్లయ్య జ్ఞాపకార్థలతో సొంత డబ్బుతో వాగు మీద వంతెన నిర్మించాలని నిర్ణయం తీసుకున్నాడు. ఇందుకోసం సుమారు 7లక్షలు ఖర్చు చేసి బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించాడు.

**పొన్నెకంటి వెంకటేశ్వర్లుని అభినందించిన కూనంనేని....**

భద్రాద్రి కొత్తగూడెం జూలూరుపాడు మండలపరిధిలోని గుండెపుడి గ్రామంలో ప్రజల అవసరాల మేరకు సుమారు 7లక్షలు ఖర్చు చేసి బ్రిడ్జి నిర్మాణం చేపట్టగా ఇట్టి బ్రిడ్జి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం శాసన సభ్యులు కూనం నేని సాంబ శివరావు ముఖ్య అతిథిగా హాజరై బ్రిడ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరు మీద గ్రామస్తులకోసం బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనే ఆలోచన చాలా గొప్పదని ప్రతి గ్రామంలో మేధావులు యువకులు గ్రామ అభివృద్ధికి పాటుపడి సహాయ సహకారాలు అందిస్తే ఏ గ్రామమైన అభివృద్ధిలో ముందుంటుందని, ఏది ఏమైనా పొన్నెకంటి వారి కుటుంబ ఆలోచన గొప్పదని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, షేక్ నాగులుమీరా, గ్రామ పెద్దలు వెంకటేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వారావుపేటలో చారిత్రాత్మక ఘట్టం

**- హార్టికల్చర్ కాలేజి ఏర్పాటుకు సర్వం సిద్ధం**
**- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జారే**



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట ః** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ చరిత్రలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. ఎన్నో ఏళ్లుగా స్థానిక ప్రజలు, రైతులు, విద్యార్థులు ఎదురు చూస్తున్న హార్టికల్చర్ కాలేజీ ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ వెల్లడించారు. బుధవారం అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల చిరకాల స్వప్నం అయిన ఉద్యానవన కళాశాల కల ఇప్పుడు నిజమైందన్నారు. హామీల్లో ముఖ్యమైనది హార్టికల్చర్ కాలేజి సాధన అని, ఇప్పుడు ఆహామీని నెరవేర్చడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ప్రజల ఆశయాలు నెరవేర్చడమే తన రాజకీయ లక్ష్యమని స్పష్టం చేశారు. నేడు రాష్ట్ర వ్యవసాయ ఉద్యానవన శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారవు చేతుల మీదుగా హార్టికల్చర్ కాలేజిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కాలేజి ద్వారా స్థానిక యువతకు ఉద్యానవన రంగంలో ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. కాలేజి ద్వారా రైతులకు కూడా ప్రత్యక్ష ప్రయోజనం ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. 47ఏళ్ల రాజకీయ అనుభవంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించారని ఎమ్మెల్యే కొనియాడారు. ప్రజలు ఆశీర్వదిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకువస్తామని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ బాధ్యతగా భావిస్తున్నామని ఎమ్మెల్యే జారే పేర్కొన్నారు. ఈ సమావేవంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో కార్పొరేట్ ఆటలు..!

**నీట్ రద్దుతో అయోమయంలో విద్యార్థులు**

**ప్రజాపక్షం/వైరాః** కార్పొరేట్ విద్యా వ్యవస్థ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతుందా, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్ధకంగా మారుతుందా, అంటే అవుననే చెప్పవచ్చును. ఎంతో కష్టపడి ఎన్నో కలలు కని విద్యార్థులు వైద్య రంగం వైపు తమ జీవితాలను ఎంచుకొని రాత్రి పగలు తేడా లేకుండా గంటల తరబడి చదివిన విద్యార్థులకు పేపర్ లీకేజి వారి పట్ల శాపంగా మరాఇంది. దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మంది పైగా నీట్ పరీక్షను వ్రాస్తే, తెలంగాణ లో సుమారు 70వేల పైన నీట్ పరీక్షకు హాజరయ్యారు. పేపర్ లీక్ కావడంతో విద్యార్థులు వ్రాసిన పరీక్షను రద్దు చేయడంతో అయోమయంలో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేట్ వ్యవస్థ వారి ర్యాంకుల కోసం అడ్డదారిలో కొందరు తప్పుడు మార్గాలను ఎంచుకొని లక్షల రూపాయలు పెట్టి పేపర్లు కొనుగోలు చేసి విద్యార్థుల జీవితాలతో చెలగటమాడుతున్నారు. ఎన్నో కలలు కని డాక్టర్ కావాలని కష్టపడి చదివిన విద్యార్థులకు కన్నీరే మిగులుస్తున్నాయి. కార్పొరేట్ రూపంలో విద్యా రంగంపై కాటు వేస్తున్నాయి. వ్యవస్థ మారాలి విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి మెరిట్ విద్యార్థులు భవిష్యత్తు బాగుండాలి అంటే కార్పొరేట్ విద్యా వ్యవస్థపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి, సరికొత్త చట్టాలు తీసుకొచ్చి విద్యార్థుల పాలిట శాపంగా మారుతున్న లీక్ వీరులను కటకటాలు పాలు చేయడంతో పాటు భవిష్యత్తుల విద్యార్థులతో గాని, ఇతర ఉద్యోగ పరీక్షలోల గాని ఎక్కడ ఎలాంటి లీక్ జరగకుండా తీసుకొచ్చే కఠినమైన చట్టాలు రావాలి, కష్టపడి చదివే ప్రతి విద్యార్థికి గుర్తింపు రావాలి అంటే కార్పొరేట్ అనే విషపు మొక్కలజను తొలగిస్తే ప్రతి విద్యార్థి జీవితంలో వెలుగులు నింపుతాయి.

# చిన్నారులకు ప్రత్యేక బైబిలు తరగతులు




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** సీఎస్ఐ డోర్నకల్ అధ్యక్ష మండలం ఆధ్వర్యంలో పాస్ట్రేట్ చైర్మన్ రెవ. డి. జాషువా పర్యవేక్షణలో కిష్టారం అంబేద్కర్ నగర్ లోని అహరోన్ ది హై ప్రెస్టీలీ చర్చిలో చిన్నారులకు మూడు రోజుల పాటు బైబిలుపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. బైబిలు వాక్య పఠనంపై అవగాహన కల్పించడంతో పాటు ఆటల పోటీలు, క్విజ్ కార్యక్రమాలు జరిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్ట్రేట్ సెక్రెటరీ పాలకుర్తి మణిబాబు, ట్రెజరర్ పాలకుర్తి రాజు, స్త్రీల మైత్రి సెక్రెటరీ జంగం సరోజిని, ట్రెజరర్ వాడపల్లి అరుణ, సండే స్కూల్ టీచర్ మంజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సన్మానం

**విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు అందజేత**



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి, శ్యామ్‌బాబు దంపతులు ఆధ్వర్యంలో 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ ఫాస్ట్ గవర్నర్ కమ్మం జిల్లా కాంగ్రెస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ హాజరయ్యారు. వార్డులో ఇటీవల పదో తరగతి పలితాల్లో అత్యధికంగా మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు స్పెకెన్ ఇంగ్లీష్ పుస్తకాలు డాక్టర్ కాపా మురళీకృష్ణ, వార్డు కౌన్సిలర్ వుంద్రు వరలక్ష్మి శ్యామ్‌బాబుతో కలిసి అందజేశారు. విద్యార్థులను ఘనంగా శాలువాలతో సన్మానించారు. అనంతరం కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు స్కిల్స్ డవలప్‌మెంట్ చేసుకునేందుకు స్పోకెన్ ఇంగ్లీష్ పాఠ్య పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ కొలువులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెనుగొండ ఉపేందర్, జోన్ చైర్మన్ చింతోజు నాగేశ్వరరావు, వాంకుడోతు బీక్యా, తేజావత్ నాగేశ్వరరావు, హుస్సేన్, పృధ్వి, దుర్గానాయక్, దుర్గయ్య, రమేష్, తేజావత్ బాల్య, గోపి, నాగేశ్వరరావు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పని దినాల్లో కొండకొడిమ ప్రథమస్థానం

**ఫీల్డ్ అసిస్టెంట్, సెక్రటరీలకు సన్మానం**



**ప్రజాపక్షం/వైరాః** వైరా మండలం కొండకొడిమ ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ వాకదాని పద్మ, గ్రామ సెక్రటరీ రవీందర్‌యాదవ్‌కు బుధవారం వైరా మండల పరిషత్ కార్యాలయం నందు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అత్యధిక పని దినాలు గ్రామ ప్రజలకు కల్పించి ప్రథమస్థానంలో ఉండటానికి కృషి చేసిన సందర్భంగా ఎంపిడివో సక్రియ, ఎంపివో రాజేశ్వరి, ఏపివో అనురాధ పలువురు మండల పరిషత్ సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడివో సక్రియ మాట్లాడుతూ కొండకొడిమ గ్రామంలో 200 మందికి పని దినాలు కల్పిస్తూ వారిని ఉపాధి హామీ పథకంలో పనిచేయించే విధంగా కృషి చేయడం ఎంతో అభినందనీయమని, వారికి ఈ సందర్భంగా సన్మానం నిర్వహించడం జరిగిందని అన్నారు. అత్యధికంగా ప్రతి గ్రామంలో పనిదినాలు ఉపాధిహామీ పథకంలో కనిపించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు.

# న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రభంజనం





**ప్రజాపక్షం/వైరాః** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ న్యూఢిలీ లవారి మే 13న ప్రకటించిన పన్నెండు ఫలితాల్లో న్యూలిటిల్ ఫ్లవర్ వైరా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. 12వ తరగతి పలితాల్లో మొత్తం 159 విద్యార్థులు హాజరు కాగా 98% ఉత్తీర్ణత సాధించారు. గందమల స్వేచ్ఛ 446 మార్కులతో మొదటి స్థానంలో నిలువగా, కట్ట ఈశ్వర్, 427 చావా సాయిక్రిష్ణ 423, పి.తేజ్‌చరన్ 422, టి.నికేతాభాయి 419, జె.కీర్తన 410, బైపిసి నందు యు.అక్షరసిరి 414, పి.తేజ హరిత 410, ఏ.పావని 407, జి.టెర్సిహెలెనా 406 మార్కులు పొంది ఉన్నత స్థాయి ఫలితాలను సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు మాట్లాడుతూ 12వ తరగతి మొదలి బ్యాచ్‌లోని విద్యార్థులు క్రమశిక్షణగా కష్టపడి జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి కాలేజికి మంచి గుర్తింపును తీసుకొచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ డాక్టర్ కాపా మురళీకష్ణ, కుర్రా ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# డబుల్ ఇంజిన్ అంటే పేపర్ల లీకేజీయేనా..?



**-కేంద్రం అసమర్ధతకు నీట్ కుంభకోణమే నిదర్శనం**
**-కూసుమంచి మండలం జీళ్లచెరువు క్లస్టర్ ప్రజా దర్బార్‌లో మంత్రి పొంగులేటి గర్జన**

**ప్రజాపక్షం/కూసుమంచి:** కేంద్రంలోని బీజేపీ సర్కార్ తన అసమర్ధతతో దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది. డబుల్ ఇంజిన్ సర్కార్ అంటే అభివృద్ధి చేయడం కాదు..పేపర్లు లీక్ చేసి నిరుద్యోగుల గొంతు కోయడమేనా..?అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జీళ్లచెరువులో నిర్వహించిన 'ప్రజా దర్బార్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.



### కేంద్రానిది కళ్లుండి చూడలేని తనం....!

నీట్ పరీక్షా పత్రాల లీకేజీపై మంత్రి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పరీక్షకు 42గంటల ముందే పేపర్లు బయటకు రావడం దారుణమన్నారు. దేశ వ్యాప్తంగా 23 లక్షల మంది మన రాష్ట్రంలో 70వేల మంది విద్యార్థులు ఈ కుంభకోణం వల్ల రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మాత్రం ఏమీ ఎరుగనట్లు నాటకమాడుతోందని విమర్శించారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన విద్యార్థులను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

### నాడు దొరల పాలనలోనూ...

తెలంగాణలో గత పదేళ్ల 'దొరల పాలన'లో జరిగిన అన్యాయాన్ని మంత్రి ఈసందర్భంగా గుర్తు చేశారు. "గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో" గ్రూప్ 1 నుండి గ్రూప్ 4 వరకు అన్ని పేపర్లూ లీక్ అయ్యాయన్నారు. ఆనాటి ప్రభుత్వం మంత్రులు పీకేలే జిరాక్స్ సెంటర్లలో పేపర్లు అమ్మారని ఆరోపించారు. ఆనాడు ఇంటర్ ఫలితాల తారుమారు వల్ల 28 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా అదే బాటలో పయనిస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే నియామక సంస్థలను ప్రక్షాళన చేసి, పారదర్శకంగా 70వేల ఉద్యోగాలను భర్తీ చేశామని చెప్పారు.

### ప్రజా దర్బార్‌లో అర్జీల వెల్లువ...

జీళ్ళచెరువు క్లస్టర్ పరిధిలోని 13 గ్రామ పంచాయితీ నుంచి తరలివచ్చిన ప్రజల నుండి మంత్రి పొంగులేటి, జిల్లా కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలపై వచ్చిన వినతులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. న్యాయమైన ప్రతి సమస్యను 100శాతం పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

# మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**- ఎలాంటి లోటపాట్లు లేకుండా చర్యలు తీసుకోండి**
**- జిల్లా కలెక్టర్ అంకిత్**
**- కొనుగోలు కేంద్రాల క్షేత్రాస్థాయి పరిశీలన**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతంగా పూర్చి చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. బుధవారం ఇల్లెందు వ్యవసాయ కమిటీ, చర్ల సముద్రం, టేకులపల్లి, బోడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి లోడింగ్, కొనుగోళ్లు, నిల్వ, రవాణా ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఇల్లెందు వ్యవసాయ కమిటీ ఆధ్వర్యంలో 54 వేల మొక్కజొన్న బ్యాంగులు నిల్వ ఉన్నట్లు తెలుసుకున్న ఆయన గోదాముల్లోనూ, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాలను చూసి నిల్వలు స్టాకు పెట్టాలన్నారు. అనంతరం రేపల్లెవాడ, కొమరాం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. నిల్వలు లేకుండా కొనుగోళ్లు చేయాలని ఆదేశించారు. కొనుగోల కేంద్రంలో 1.50 లక్షల మొక్కజొన్న బ్యాగులు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపగా వాటిని సూర్యపేట జిల్లా కోదాడ మార్కెట్ యార్డుకు తరలిస్తున్నట్లు వివరించారు. బోడు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు.



ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట్ జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, మార్కెట్ అధికారి నరేందర్, తహాశిల్దార్, ఎంపిడిఓలు, కొనుగోలు కేంద్రాల ప్రత్యేకాధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు అలర్ట్..!



**-ఈకేవైసీ పూర్తి చేయకపోతే జాబ్ కార్డుల రద్దుకు అవకాశం**
**-బూర్గంపాడులో స్వయంగా నమోదు ప్రక్రియ చేపట్టిన ఎంపీడీవో జమలారెడ్డి**

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో ఉపాధి హామీ పథకం అమలులో పారదర్శకత పెంచేందుకు అధికారులు ఈకైవేసీ ప్రక్రియను వేగవంతం చేశారు. జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఉపాధి కూలీ తప్పని సరిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)జమలారెడ్డి స్పష్టం చేశారు. నమోదు చేయించుకోని వారి పేర్లు జాబ్ కార్డుల నుంచి తొలగించే అవకాశం ఉందని హెచ్చరించారు. బుధవారం బూర్గంపాడు గ్రామ పంచాయితీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి స్వయంగా కూలీల ఈకేవైసీ నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ఉపాధి పనులకు హాజరయ్యే అసలైన లబ్దిదారుల వివరాలు మాత్రమే ప్రభుత్వ రికార్డుల్లో ఉండేలా ఆధార్ అనుసంధానం చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం ఈకేవైసీ ప్రక్రియను ఫేషియల్ రికగ్నిషన్ సాంకేతికతతో నిర్వహిస్తున్న వెల్లడించారు. కూలీలు తమ గ్రామ పంచాయితీ కార్యాలయం లేదా ఫీల్డ్ అసిస్టెంట్‌ను సంప్రదించి వెంటనే నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. కొతంత నిబంధనల ప్రకారం ఈకేవైసీ లేని కూలీలకు వేతనాల చెల్లింపుల్లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అందువల్ల ఉపాధి హామీ కార్మికులు ఆలస్యం చేయకుండా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో స్ధానిక సర్పంచ్ మందా నాగరాజు, ఈసీ వెంకట్, ఉపాధి హామీ టీఏలు, మేట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పసికందు తలను పీక్కుతిన్న కుక్కలు

**- అత్యంత హృదయ విదారక ఘటన**
**- దుర్వాసన రావడంతో గమనించిన స్థానికులు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** పట్టణ పరిధిలోని బొల్లోరుగూడెంలోని ఓ ప్రైవేటు కళాశాల సమీపంలో బుధవారం ఉదయం సుమారు మూడు నెలల పసికందు తలను కుక్కలు అత్యంత పాషవికంగా పీక్కుతున్న ఘటన చోటు చేసుకుంది. వివరాల ప్రకారం కళాశాల సమీపంలోని ఓ ఇంటి పరిసర ప్రాంతాల్లో మొండెం నుండి వేరైన తలను కుక్కలు పీక్కుతింటున్నట్లు గమనించింది. వెంటనే ఆమె విషయాన్ని తన భర్తుకు తెలపడంతో ఆయన కార్పొరేటర్ సిరిపురపు సుగుణకు సమాచారం అందించారు. ఆమె ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మొండెం నుండి వేరైన తలను స్వాదీనం చేసుకుని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ పరిధిలోని నిరుద్యోగ గిరిజన యువతీ యువకులను గుర్తించి వారికి వృత్తి నైపుణ్యాలు నేర్పించి జీవనోపాధి కల్పించాలని గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ ఐటిడిఏ పిఓలతో అన్నారు. ఈ మేరకు నిర్వహించిన వీడియో కాన్ఫిరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ అప్పరేల్, బ్యూటీవెల్‌నెస్, అగ్రికల్చర్, టూరిజం, హాస్పటాలిటి తదితర రంగాల్లో 2300 మందికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ పిఓ మాట్లాడుతూ 220 మంది యువత సిద్ధంగా ఉన్నారని, ఈ నెల్లోనే శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. ఈనెల 14 నుండి 18 వరకు ఇల్లందు, చర్ల, దుమ్ముగూడెం, గుండాల, ్ధండాల ప్రాంతాల్లో అవగాహ శిబిరాలు నిర్వహించనున్నట్లు పిఓ తెలిపారు.

# యువతి ఆత్మహత్య ఘటనపై కేసు నమోదు

**ప్రజాపక్షం/ములకలపల్లి:**ములకలపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన కొంద్రు అశ్విని(19)ఆత్మహత్య ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం అశ్విని ఇటీవల హైదరాబాద్‌లో కంప్యూటర్ కోర్సు పూర్తి చేసుకుని వారం రోజుల క్రితం ఇంటికి వచ్చింది. ఇంటి వద్దే ఉంటూ ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌తో గడుపుతుండేది. ఈ క్రమంలో అశ్విని అమ్మమ్మ అనారోగ్యానికి గురికావడంతో తల్లి నాగమణి జగన్నాధపురంలో ఉన్న ఆమె వద్దకు వెళుతూ, సెల్‌ఫోన్ పక్కనపెట్టి ఇంటి పనులు చూసుకోవాలని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన అశ్విని మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ములకలపల్లి ఎస్ఐ మధు ప్రసాద్ తెలిపారు.

# శ్రీ కంఠ మహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ





**ప్రజాపక్షం/గుండాల :** గౌడకులస్తుల ఆరాద్య దైవంగా కొలుచుకునే శ్రీకంఠ మహేశ్వరస్వామి ఆలయ, విగ్రహప్రతిష్ఠ మండలకేంద్రంలో బుదవారం అంగరంగ వైభవంగా జరిగింది. పూజారులు కౌండిన్య రాజు, ఆయి, పరమేష్, సమ్మయ్య, రామాలయ పూజారి సనత్ ఆద్వర్యంలో అత్యం భక్తి శ్రద్దలతో పూజలు నిర్వహించారు. శిలాయంత్రం, ప్రాణ ప్రతిష్ట్ర, గుమ్మడికాయ పూజలు నిర్వహించారు. విచ్చేసిన వందలాది మంది భక్తులకు మహాఅన్నదానకార్యక్రమం నిర్వహించారు. అనంతరం కంఠమహేశ్వరస్వామి ,రేణుక ఎల్లమ్మ, బోనాలతో మహిళలు పెద్దసంఖ్యలో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని దేవతా మూర్తులకు నైవేద్యం సమర్పించారు. కులదేవతా వేశాదారనలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి స్వామివారి కళ్యాణం , మేలుకొలుపుట, గావుపట్టుట,బలి ప్రదానం చేశారు. ఈ ప్రతిష్ఠాకార్యక్రమంమూడురోజులపాటు భక్తుల అత్యంభక్తి శ్రద్దలతో, నియమ నిబంధనలోతో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా దాతలను, కమిటి సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయకమిటి సభ్యులు గుండెబోయిన లక్ష్మి నారాయణ, బత్తిని రమేష్, యాసారపు సురేష్, తీగల ముఖేష్,బత్తిని సాయన్న, బుసనమోయిన సమ్మయ్య, బొంగు సిద్దయ్య, బొబ్బిలి రమేష్, గంగాధరి ప్రమోద్,యాసారపు తిరుపతి, యాసారపు యాకయ్య, మాచర్ల రంజిత్, వంశి, వినయ్, నాగరాజు, మొక్క నరెందర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల ఫలితాల ప్లెక్సీలు ఏర్పాటు




**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** సాధారణంగా ప్రవేట్ పాఠశాల యాజమాన్యాలు పదో తరగతి ఫలితాల గురించి ప్రచారం హోరెత్తిస్తారు. మండల విద్యాశాఖ వారికి దీటుగా విస్తృతంగా ప్రచారం చేపట్టారు. మండల వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థుల ఫోటోలతో ప్లెక్సీలు ఏర్పాటు చేశారు. మండలంలోని ప్రతీ పంచాయతీలలో ప్లెక్సీలు ఏర్పాటు చేయటంతో పాటు, మైక్ ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రవేట్ తరహాలోనే ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఫోటోలతో ప్లెక్సీలు ఏర్పాటు చేయటంతో తల్లిదండ్రులు, విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆలోచిస్తున్నారు. ఈ ప్రచారం అంతా కూడ నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బీ.చలపతి రావు సొంత ఖర్చులతో నిర్వహించటం విశేషం. మండలంల లోని విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు యంఈవో ను అభినందిస్తున్నారు.

# అభివృద్ధే ఆయన ఆకాంక్ష

-సాగుపై తరగని మక్కువ
-మంత్రిగా 40 ఏళ్ల తుమ్మల
-ఉమ్మడి జిల్లాపై
చెరగని ఓ సంతకం





(ఫైల్)



ఆయన ఎక్కడున్నా అభివృద్ధి పరమైన ఆలోచనలే. ఎంత తీరిక లేని పనిలో ఉన్నా, ఏ హోదాలోఉన్న సాగుపై మాత్రం తరగని మక్కువ. రైతుగా తాను పంట పండించడంతో పాటు వేలాది మంది రైతులకు సూచనలు ఇస్తూ సాగును లాభ సాటిగా మార్చుకునేందుకు తన వంతు కృషి చేస్తుంటాడు. ఏ రాజకీయ పార్టీలో ఉన్న ఖమ్మంజిల్లా అభివృద్ధిపై మాత్రం ఆయనకు ప్రత్యేక దృష్టి ఉంటుంది. ముఖ్యంగా సాగునీటి వనరులు, రవాణా, పరిపాలన కార్యాలయాల నిర్మాణం పట్ల ఆయన ప్రత్యేకమైన ఆసక్తి. సువిశాలమైన ఖమ్మం జిల్లాలో ప్రతి పల్లెలోనూ ఆయన చేపట్టిన అభివృద్ధికి సంబంధించిన ఓ శిలాఫలకం ఉందంటే అతిశయోక్తి కాదు. ఆయనే తుమ్మల నాగేశ్వర రావు. వ్యవసాయ కుటుంబంలో జన్మించి రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న తుమ్మల నాగేశ్వరరావు మంత్రిగా బాధ్యతలు స్వీకరించి నేటికి సరిగ్గా 40 సంవత్సరాలు అవుతుంది. 1985 మే 14న దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు మంత్రి వర్గంలో తొలిసారి మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు గెలిచినా ఓడినా ప్రజల మధ్యనే నిలిచి పదవిలో ఉన్నా లేకున్నా అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారు. తొలిసారి 1983లో సత్తుపల్లి నియోజక వర్గం నుంచి అప్పటి రాజకీయ ఉద్దండుడుగా పేరొందిన జలగం వెంగళరావును ఢీకొన్నారు. స్వల్ప తేడాతో ఓటమి చెందిన ఎన్‌టి రామారావు గెలిచిన వారి కంటే తుమ్మలను సమావేశంలో అందరికి పరిచయం చేస్తూ ఖమ్మం జిల్లా రాజకీయ భవిష్యత్తు నేతగా తుమ్మలను అభివర్ణించాడు. ఎన్‌టి రామారావు నోటి వెంట వచ్చిన ఆ పలుకులు వృధా కాలేదు. 1985లో అదే సత్తుపల్లి నియోజక వర్గం నుంచి గెలిచి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత నారా చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలో పలు శాఖలను నిర్వహించిన ఆయన చంద్రబాబుకు కుడి భుజంగా పనిచేశారు. చంద్రబాబు నాయుడు పదేళ్ల పదవి కాలంలో తుమ్మల నాగేశ్వర రావు ఉమ్మడి జిల్లా అభివృద్ధికి బాటలు వేశారు.పేరూరు నుంచి ఎర్రుపాలెం వరకు అశ్వారావుపేట నుంచి నాయకన్ గూడెం వరకు ఆయన అభివృద్ధి ఎక్కడ చూసిన కనపడుతుంది. తాలిపేరు ప్రాజెక్టు, గోదావరిపై రెండవ బ్రిడ్జి మొదలు రామాలయం అభివృద్ధి, పలు సాగునీటి ప్రాజెక్టులతో ఏజెన్సీకి నూతన జవ సత్వాలను తీసుకువచ్చారు. ముఖ్యంగా పరిపాలన కార్యాలయాల నిర్మాణం, పాలనలో పారదర్శకత పట్ల తుమ్మలను నిరంతరం మననం చేసుకోవాల్సిందే. కరువు మండలంగా పేరొందిన తిరుమలాయపాలెంను సస్యశ్యామలం చేసే దిశగా భక్తరామదాసు ప్రాజెక్టు చేపట్టి అనతి కాలంలోనే పూర్తి చేయడం ద్వారా ఆ ప్రాంత రైతుల దశాబ్దాల కలను నెరవేర్చారు. మండు వేసవిలోనూ చెరువుల్లో పుష్కలంగా నీరు ఉన్నాయంటే అది తుమ్మల చలువేనని జగమెరిగిన సత్యం. ముఖ్యంగా రహదారుల నిర్మాణంతో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్న భావనతో ఆయన రహదారుల నిర్మాణంపై దృష్టిసారించి పలు చారిత్రాత్మక ప్రాజెక్టులను సాధించారు. రైతుగా తుమ్మల అందరికీ సుపరిచితుడు. గత రెండేళ్లుగా తుమ్మల నాగేశ్వరరావు పామాయిల్ సాగు విస్తృతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారు. సాంప్రదాయ పంటల స్థానే లాభసాటి పంటలను సాగు చేయాలన్న ఆయన ఆలోచనకు అనుగుణంగా రైతులను కదిలిస్తున్నారు. మొత్తంగా మంత్రిగా 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తుమ్మల ప్రస్తుత రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు. వ్యవసాయ రంగం ఒక సంక్లిష్ట స్థితిలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో అవినీతి మచ్చలేని మంత్రిగా ఆయన పేరొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇప్పటి తెలంగాణలోనూ సీనియర్ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు కృషి అపూర్వం, అనిర్వచనీయం. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని, ఆయురారోగ్యాలతో జిల్లా అభివృద్ధికి పునరంకితం కావాలని ఆశిస్తూ ...

-ప్రజాపక్షం/ఖమ్మం

# దయనీయ స్థితిలో రైతాంగం..!

-ఆన్‌లైన్ ఇబ్బందుల్లో మక్క రైతులు
-కాంటాల్లో కోతలు
-రైతులకు శాపంగా
మారిన ప్రభుత్వ నిర్లక్ష్యం





ప్రజాపక్షం/ ఖమ్మం : రైతాంగం పరిస్థితి దయనీయంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కొనుగోలు చేసే వారు లేక రెండు నెలలుగా రైతాంగం ఆరిగోస పడుతున్నారు. ఈ ఏడాది యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్నలు, ధాన్యం విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రణాళిక లేని వ్యవహార శైలి రైతుల పాలిట శాపంగా మారింది. రక రకాల విధానాలతో కొర్రీలు పెడుతున్నారు. ముఖ్యంగా మక్కల విషయంలో ఆన్‌లైన్ పద్ధతిని తీసుకు రావడంతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. సర్వర్ పనిచేయక పోవడం కౌలు రైతుల విషయంలో నమోదు ప్రక్రియ జరగకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద మండుటెండలో నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల నుంచి తరలించిన మొక్కజొన్నలకు ఇంత వరకు ఖమ్మం జిల్లాలో ఒక్క రూపాయి కూడా చెల్లింపులు జరగలేదు. కాంటా వేయడం ఎగుమతి చేయడం పెనుభారంగా మారిన వేళ లోడింగ్ కోసం 50 కేజీల బస్తాకు రూ. 50 నుంచి రూ.75 వరకు వాహనాల యజమానులు వసూలు చేస్తున్నారు. రోజుల తరబడి దిగుమతి కాకపోవడం వల్ల ఈవిధంగా వసూలు చేయాల్సి వస్తుందని లారీల యజమానులు అంటున్నారు. దిగుమతి అయిన తర్వాత తక్‌పట్టీల పంపిణీలోనూ తీవ్ర జాప్యం జరుగుతుంది. ముఖ్యంగా కౌలు రైతుల ఇబ్బందులు వర్ణణాతీతం. ఆన్‌లైన్ ప్రక్రియ సాగక పోవడంతో కనీస సౌకర్యాలు లేక రైతులు సొమ్మసిల్లి పోతున్నారు. మొక్కజొన్నల నిల్వలకు సంబంధించి గోడౌన్లు లేకపోవడం జిల్లాలో మొక్కజొన్నల దిగుబడి , కొనుగోళ్లు, తరలింపు, గోడౌన్లకు సంబంధించి సరైన ప్రణాళిక లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని దీనితో పాటు గోనెసంచులు, హమాలీలు, వాహనాల సమస్య కూడా తీవ్రం కావడంతో రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారు.

### ఆగని కోతలు...

ధాన్యం రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. కొనుగోలు కేంద్రాల్లోనే తేమ శాతం చూసి కాంటాలు వేసినప్పటికీ మిల్లర్లు మాత్రం కోతలు ఆపడం లేదు. క్వింటాకు 10 కేజీల వరకు కోత విధిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అసలు ధాన్యమే మాకు అవసరం లేదంటూ తిప్పి పంపుతున్నారు. రైతులు మిల్లర్లను బతిమిలాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మొత్తంగా ప్రభుత్వ వైఫల్యమే ఈ పరిస్థితికి కారణమైంది.

## మహాసభకు రూ. 50వేల విరాళం



ప్రజాపక్షం/ ఖమ్మం : తెలంగాణ మహిళా సమాఖ్య ఖమ్మంజిల్లా మహాసభలను పురస్కరించుకుని బత్తినేని నీరజ రూ. 50వేల విరాళాన్ని అందజేశారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఈ మొత్తాన్ని జిల్లా కార్యదర్శి దండి సురేష్ చేతుల మీదుగా మహిళా సమాఖ్య జిల్లా సమితికి అందజేశారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ మహిళా సమాఖ్య ఉద్యమ నిర్మాణానికి బత్తినేని కుటుంబం పెద్ద మొత్తంలో విరాళాన్ని అందించడం అభినందనీయమన్నారు. తండ్రి తూము ప్రకాశరావు వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణంలో పాలు పంచుకుంటున్న బత్తినేని నాగప్రసాద్, నీరజ, వారి తనయులు ప్రకాష్, రాకేష్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, మహిళా సమాఖ్య బాధ్యులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, తాటి నిర్మల, మందడపు రాణి తదితరులు పాల్గొన్నారు.

## బడి బలోపేతంలో సర్పంచ్ లపాత్ర కీలకం



ప్రజాపక్షం/నేలకొండపల్లి: ప్రభుత్వ బడి బలోపేతంలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య పేర్కొన్నారు. విద్యా వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో సర్పంచ్ లుకు బుధవారం అవగాహేన కార్యక్రమం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య నమోదు ను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. కొత్త విద్యా విధానం పై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. విద్యార్థులతో పాటు మధ్యాహ్నం భోజనం చేసి, నాణ్యత తెలుసుకోవాలని సూచించారు. ప్రవేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే పథకాలను స్థానికంగా వివరించాలని సూచించారు. తల్లిదండ్రులను కౌన్సిలింగ్ నిర్వహించి ప్రభుత్వ వైపు మొగ్గు చూపాలని సూచించారు. బడులు ప్రారంభించేనాటికి గ్రామాలలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. జిల్లాలోనే విద్యాశాఖ తీరు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గోపగాని రమేష్, ఆయా పంచాయతీ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.